క్లుప్తంగా

శ్రీకాకుళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఘంటసాల(అవనిగడ్డ): శ్రీకాకుళంలో శుక్రవారం శ్రీకాకుళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరిగాయి. దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈఓ ఎస్ఎస్ చక్రధరరావు పర్యవేక్షించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంయూడీఏ చైర్‌పర్సన్



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా కలెక్టర్ పి. రాజాబాబును మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంయూడీఏ) చైర్‌పర్సన్ బొర్రా నాగదుర్గాభవాని ఆయన చాంబర్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్‌పర్సన్ భర్త, మచిలీపట్నం అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్‌రావు కలెక్టర్‌కు పూల మొక్క, మెమెంటోను అందజేశారు. అనంతరం వీరు పలు అంశాలపై చర్చించారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

మచిలీపట్నంటౌన్: పదో డివిజన్‌కు చెందిన కమ్మిలి చిట్టెమ్మ కాలికి గాయమై అవుటుపల్లిలోని పిన్నమనేని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వైఎస్సార్ సామాజిక పింఛనును డివిజన్‌లోని సి–13 క్లస్టర్ వలంటీర్ సుంకర సీత శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి ఆమెకు పింఛను సొమ్ము అందజేసింది. వలంటీర్‌ను డివిజన్ కార్పొరేటర్ షేక్ ముంతాజ్‌బేగం, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి షేక్ బాషా అభినందించారు.

ముగిసిన పింఛన్ల పంపిణీ

చిలకలపూడి(మచిలీపట్నం): వైఎస్సార్ పింఛన్ కానుక పథకం ద్వారా పింఛన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 2,36,249 మందికి పింఛన్లు అందజేయాల్సి ఉండగా.. ఆయా సచివాలయాల పరిధిలో వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి 2,34,012 మందికి పింఛన్లను అందజేసి 99.05 శాతం సాధించారు. జిల్లాలో పెనమలూరు, తోట్లవల్లూరు, గూడూరు మండలాలు పింఛన్ల పంపిణీలో మొదటి మూడు స్థానాలు సాధించాయి.

నేడు విశ్రాంత ఉద్యోగులకు ఈకేవైసీ

పెడన: పెడన మండలంలో ప్రభుత్వ పెన్షన్ పొందుతున్న విశ్రాంత ఉద్యోగులకు ఈకేవైసీ చేయించుకునేందుకు పెడన ఎంపీడీఓ కార్యాలయంలో అవకాశం కల్పించామని పెడన ఇన్‌చార్జి ఎంపీడీఓ డి. సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి బందరు ట్రెజరీ కార్యాలయానికి చెందిన వారు పెడన ఎంపీడీఓ కార్యాలయంలో ఈకేవైసీ చేస్తారన్నారు. విశ్రాంత ఉద్యోగులు ఆధార్ కార్డు, పెన్షన్‌కు లింక్ అయిన ఫోన్ నెంబర్ కలిగిన ఫోన్‌తో వచ్చి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

పెడన: స్థానిక పాతపేటలోని ముత్యాలమ్మతల్లి (పైడమ్మ ఘటం)దేవాలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారిని పూలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బోనస్ పంపిణీ

చల్లపల్లి: పాల ఉత్పత్తిదారులకు స్థానిక పాల కేంద్రంలో శుక్రవారం బోనస్ పంపిణీ చేశారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో 2022–23 సంవత్సరం మూడో విడత బోనస్‌ను 146 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.3,98,780 పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షురాలు బెల్లంకొండ లక్ష్మి, వేతన కార్యదర్శి గొరిపర్తి మురళీకృష్ణ, సూపర్‌వైజర్ తోట సురేష్, గొరిపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల బౌద్ధ విహార్‌లో బుద్ధ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బౌద్ధ గురువు ధమ్మ ధజ బంతేజీ బౌద్ధ వందనం, ప్రార్థన చేశారు. బౌద్ధ విహార్‌లో ఏర్పాటు చేసిన బుద్ధుని ప్రతిమను మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించి మాట్లాడారు. వృద్ధులు, వితంతువులకు వస్త్రాలను బహూకరించారు.

బుద్ధుని జ్ఞాన సందర్శన యాత్ర

ఘంటసాల(అవనిగడ్డ): ఏపీ దళిత బహుజన ఫ్రంట్ ప్రొఫెషనల్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం బుద్ధుని జ్ఞాన సందర్శన యాత్ర నిర్వహించారు. ఏపీ దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి మేళం భాగ్యారావు ఆధ్వర్యంలో ఈ యాత్ర సాగింది. ఘంటసాలలోని బౌద్ధ స్తూపాన్ని సందర్శించి బుద్ధునికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కనుల పండువగా కల్యాణోత్సవాలు

కోడూరు: వేద పండితుల మంత్రోచ్చరణలు.. బాజా భజంత్రీలు, మేళతాళాల నడుమ పలుచోట్ల స్వామివార్ల కల్యాణోత్సవాలు కనులపండువగా జరిగాయి. కోడూరు మండలం మందపాకల శివారు పాదాలవారిపాలెం గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి కల్యాణోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. అనంతరం ప్రత్యేక పల్లకిలో స్వామి, అమ్మవార్లను ఆలయం చుట్టూ ఊరేగించి కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. పండితుడు కాశీభొట్ల శంకరశాస్త్రి మంత్రవచనాల నడుమ కల్యాణతంతును శాస్త్రోక్తంగా నిర్వహించగా, బెల్లంకొండ జయప్రకాష్ –అశ్రితలు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. దేవదాయ అధికారులు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. కల్యాణాన్ని పురస్కరించుకొని ఆలయం వద్ద రెండు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఈఓ సుధాకర్, ఆలయ కమిటీ చైర్మన్ పరిశె భిక్షాలరావు, జేఏ దాసరి గిరిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పాదాలవారి పాలెంలో వేణుగోపాలుని కల్యాణం నిర్వహిస్తున్న కల్యాణకర్తలు, పండితులు



బందరుకోట నరసింహస్వామి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే పేర్ని నాని దంపతులు



అవనిగడ్డ లక్ష్మీనారాయణ స్వామి కల్యాణ మహోత్సవం



భావదేవరపల్లిలో భావన్నారాయణుని కల్యాణ పూజలు నిర్వహిస్తున్న దంపతులు

వైభవంగా భావన్నారాయణుని కల్యాణం

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని శ్రీదేవి భూదేవి రాజ్యలక్ష్మి సమేత భావన్నారాయణ స్వామి కల్యాణ మహోత్సవం గురువారం రాత్రి కనులపండువగా జరిగింది. పీటలపై భోగాది లోకేశ్వరరావు దంపతులు, వెంకట శేషగిరిరావు దంపతులు కూర్చున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పామర్తి సీతారామయ్య పర్యవేక్షణలో ఆలయ అర్చకులు స్వామివారి వివాహ తంతు జరిపారు. ఎదుర్కోలు ఉత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం రథోత్సవం, మహా అన్నసమారాధన జరిగాయి.

బందరులో కల్యాణోత్సవాలు ..

మచిలీపట్నంటౌన్: బందరుకోటలోని నరసింహ స్వామి ఆలయంలో కల్యాణ మండపం, శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి వారి కల్యాణం కనులపండువగా జరిగింది. కల్యాణంలో ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), జయసుధ దంపతులు పీటలపై కూర్చున్నారు. కల్యాణానికి మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), వైఎస్సార్ సీపీ 21వ డివిజన్ ఇన్‌చార్జి మన్నే శేషయ్య, పలువురు కార్పొరేటర్లు, పార్టీ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు. ఆలయ ఈఓ తిక్కిశెట్టి వీరవెంకట మోహనరావు పర్యవేక్షించారు.

నాగేశ్వరుని కల్యాణం..

నగరంలోని ఖొజ్జిల్లిపేట నాగేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి వారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవాన్ని జనార్దన్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు వేల మంది భక్తులకు స్వామి వారి అన్నప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ ధర్మరాజు, ఆలయ ఈఓ కృష్ణారావు పర్యవేక్షించారు.

లక్ష్మీనారాయణస్వామి కల్యాణం..

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణ స్వామి కల్యాణోత్సవం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ఆగమ పండితులు దివి పార్థవెంకట రామ శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, కల్యాణ మహోత్సవం జరిగింది. తొలుత స్వామివారికి నిత్య హోమం, బలిహరణ, జగజ్జ్యోతి, ఎదుర్కోలు ఉత్సవాలను నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పోతురాజు భాస్కరరావు, ఈఓ పి. సీతారామయ్య పర్యవేక్షించారు.

సిబ్బంది పనితీరు మెరుగు పడాలి

- బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలి
- సచివాలయాల కృష్ణా ఇన్‌చార్జి సుబ్బారావు

పెడన: పనితీరు మెరుగుపరుచుకోవాలని, ఎప్పటికప్పుడు ఆయా పథకాలను అప్‌డేట్ చేసుకుంటూ పనిభారాన్ని తగ్గించుకుని అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని సచివాలయాల కృష్ణా జిల్లా ఇన్‌చార్జి, గుడివాడ డీఎల్‌డీఓ కేఎస్ఎస్ సుబ్బారావు అన్నారు. శుక్రవారం ఆయన పట్టణ, మండలంలోని వార్డు, గ్రామ సచివాలయాలకు చెందిన వార్డు అడ్మిన్లు, వెల్ఫేర్ సెక్రటరీలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి సూచికలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ ముందుకు సాగాన్నారు. ఆయుష్మాన్ భారత్, స్పందన వంటి కార్యక్రమాలలో వేగం పెంచాలని, అలాగే సర్వే సమయంలో నివేదికలు వేగంగా ఉండాలని సూచించారు.



మాట్లాడుతున్న సుబ్బారావు

ఆన్‌లైన్ రిపోర్టులు పంపించే విషయంలో జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. సిబ్బంది హాజరు విషయంలో ఫేస్ రీడింగ్ స్కాన్ లేదా బయోమెట్రిక్ హాజరు సకాలంలో ఉండేలా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఏమాత్రం విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నా సచివాలయానికి చెందిన హెడ్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సచివాలయంలో పనిచేసే ఇతర సిబ్బంది వారి బాధ్యతలు, విధులు కూడా సక్రమంగా నిర్వహించేలా పర్యవేక్షించాలని హెచ్చరించారు. వలంటీర్లతో ప్రతి నెలా సమావేశాలను ఏర్పాటు చేసి వారికి దిశానిర్దేశం చేయాలని, వారి హాజరు ఎలా ఉందో కూడా గమనించాలని చెప్పారు. సమావేశంలో మచిలీపట్నం డీఎల్‌డీఓ జి. పద్మ, పెడన తహసీల్దారు పి. మధుసూదనరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ డి. సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్యలు అడ్మిషన్లకు పలు విషయాలపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా హాజరు వేయాల్సి ఉంటుందని వివరించారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామాల్లో సుపరిపాలన

విక్టర్ ప్రసాద్, పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: గ్రామ స్వరాజ్య స్థాపన కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల వ్యవస్థను ప్రారంభించారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్, వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. శుక్రవారం పెదపట్నం, మంగినపూడి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ప్రారంభోత్సవంలో వారు పాల్గొన్నారు. పెదపట్నంలో గడిదేశి అనూష, మంగినపూడిలో సర్పంచ్ కూనపురెడ్డి ప్రమీలారాణి ప్రారంభించారు. కిట్టు మాట్లాడుతూ గతంలో ఏ పని కావాలన్నా పట్టణానికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. అక్కడ అధికారులు అందుబాటులో లేకుంటే మరోమారు పట్టణానికి వెళ్లేవారని చెప్పారు. పట్టణాలతో పాటు మారుమూల గ్రామాల ప్రజలు అటువంటి ఇబ్బందులు ఎదుర్కోకూడదనే సదుద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏ గ్రామానికి ఆ గ్రామంలోనే పనులు అయ్యేలా సచివాలయాలు ఏర్పాటు చేశారన్నారు. రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లాలంటే పడే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారని చెప్పారు. పెదపట్నంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు కరుణిస్తేనే ప్రజలకు పనులు జరిగే పరిస్థితి ఉండేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారులనే ప్రజల వద్దకు పంపి పనులు చేయిస్తోందని వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వంటి ముఖ్యమంత్రి మన రాష్ట్రంలో ఉండటం ప్రజల అదృష్టమన్నారు. ముడా చైర్మన్ బొర్రా దుర్గాభవానీ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేశారన్నారు. డ్వామా పీడీ, మండల ప్రత్యేకాధికారి జీవీ సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ గడిదేశి బాలజేస్సు, నాయకుడు చిటికెన నాగేశ్వరరావు, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.



పెదపట్నంలో ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న సర్పంచ్ అనూష. చిత్రంలో పేర్ని కిట్టు, విక్టర్‌ప్రసాద్

భక్తిశ్రద్ధలతో గురవమ్మ జాతర

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): ఉత్తర చిరువోలు లంకలోని గురవమ్మ తల్లి జాతర మహోత్సవం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. మోపిదేవి ఎస్ఐ పద్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జాతర మహోత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి కుంభం పోశారు. సమీపంలోని కృష్ణానదిలో స్నానాలు ఆచరించి పోతురాజు శిలలతో, ఎడ్లబండ్లపై అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించగా మహిళలు నీళ్ల వారపోసి హారతులు ఇచ్చారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. బంధుమిత్రుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయ కమిటీ చైర్మన్ నడకుదుటి గోవిందరావు, సర్పంచ్ చింతా శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. నడకుదుటి పున్నయ్యశాస్త్రులు, నడకుదుటి రాము తదితరులు సహాయ సహకారాలు అందించారు.

బలుసులమ్మ తల్లి జాతర..

బంటుమిల్లి: మల్లేశ్వరం గ్రామంలోని బలుసులమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం భక్తులు ఘటాలను మేళతాళాలు, కనక తప్పెట్లతో ఇంటింటికి తిరుగుతూ గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు ఘటాలకు నీళ్లు వారబోసి హారతులిచ్చి స్వాగతం పలికారు. భక్తులు ఉదయం పెద్దఎత్తున అమ్మవారికి చద్ది నైవేద్యాలు బోనాలుగా సమర్పించారు. కమిటీ సభ్యులు, ఎంపీటీసీ పి. వీరబాబు, మాజీ సర్పంచ్ కె. నాగేశ్వరరావు, చంటి, నాయకులు పాల్గొన్నారు.



మల్లేశ్వరంలో బలుసులమ్మ ఘటాల గ్రామోత్సవం

లంకమ్మ నెల సంబరానికి పోటెత్తిన భక్తులు

అవనిగడ్డ: నెల సంబరం సందర్భంగా లంకమ్మ అమ్మవారి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొందరు భక్తులు గటం బిందెలు ఎత్తుకుని డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, మజ్జిగ ప్యాకెట్లను అందించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అన్నపరెడ్డి రాందాస్, ఆలయ ఈఓ పి. సీతారామయ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్ నేతృత్వంలో ఎస్ఐ జి. రమేష్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠోత్సవం

నాగాయలంక: గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మండవ వారి గంగమ్మతల్లి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. జాతర సంప్రదాయాల ప్రకారం ఆలయ కమిటీ చైర్మన్ మండవ మధుసూదనరావు (బుజ్జి) దంపతులు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. తొలుత శిలలతో ఊరేగింపు నిర్వహించారు. శనివారం రాత్రి అమ్మవారి గ్రామోత్సవం, ఆదివారం అమ్మవారి ఘటం గుడికి చేరడంతో జాతర, అన్నసమారాధన జరుగుతాయని కమిటీ ప్రతినిధులు తెలిపారు. మండవ బాలవర్ధిరావు, మండవ బాబూరావు, సుబ్బారావు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మండవ వంశీయులు పాల్గొన్నారు.

పద్మశాలిపేటలో భావనారుషి విగ్రహ ప్రతిష్ఠ

లక్ష్మీపురం(చల్లపల్లి): లక్ష్మీపురం శివారు శివరామదుర్గాపురం పద్మశాలిపేటలో శుక్రవారం నూతన దేవాలయంలో భావనారుషి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఈ ఆలయంలో భద్రావతి సమేత భావనారుషి స్వామి నూతన విగ్రహాలను దాతలు అందె లక్ష్మణస్వామి–విజయలక్ష్మి దంపతులచే ప్రతిష్ఠించారు. అన్నసమారాధన జరిగింది.

తిరు నక్షత్ర పూజలు

అవనిగడ్డ: స్థానిక గీతా మందిరంలో వైశాఖ శుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని శుక్రవారం లక్ష్మీనారాయణస్వామి వారికి తిరునక్షత్ర పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. ఆగమ పండితులు దివి నరసింహమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ యర్రంశెట్టి హరిబాబు పర్యవేక్షించారు.

జూలై నాటికి వైద్య కళాశాల పూర్తి

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జూలై చివరి నాటికి అన్ని సదుపాయాలతో మచిలీపట్నం వైద్య కళాశాలను పూర్తి చేసి ఆగస్టులో అడ్మిషన్లు ప్రారంభిస్తామని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. శుక్రవారం ఆయన చాంబర్‌లో వైద్య కళాశాల భవన నిర్మాణాల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ. 550 కోట్లతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వైద్య కళాశాలలో మే నెల చివరి నాటికి లెక్చరర్ గ్యాలరీ బ్లాక్, తరగతి గదులు, ప్రయోగశాల బ్లాక్, డిపార్ట్‌మెంటల్ బ్లాక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, అకడమిక్ అండ్ ఎగ్జామినేషన్ బ్లాక్, బాలబాలికల వసతిగృహాల నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఫర్నిచర్, అంతర్గత అప్రోచ్‌రోడ్ల నిర్మాణాలను పూర్తి చేసి నీటి వసతి కోసం పైప్‌లైన్ నిర్మాణానికి అంచనాలు రూపొందించి మునిసిపల్ కమిషనర్‌కు పంపాలని చెప్పారు. వైద్య కళాశాలలో ఇతర మౌలిక సదుపాయాల కోసం 15 ఎకరాలు అదనంగా భూ సేకరణ చేయాల్సి ఉందని, అందుకు నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో 150 మంది విద్యార్థులకు మొదటి సంవత్సరం అడ్మిషన్లు కల్పించేందుకు సిద్ధపరచడంతో పాటు విద్యార్థులు రెండో సంవత్సరంలో ప్రవేశించే నాటికి వైద్య కళాశాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి. రవీంద్రబాబు, ఏపీఎంఎంఎస్ఐడీసీ ఈఈ లింగం నాయుడు, మెగా ప్రాజెక్టు మేనేజర్ వెంకట జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

సీఎం జగన్ సభకు తరలిరండి

మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: బందరు పోర్టు పనులను ప్రారంభించేందుకు నగరానికి ఈ నెల 22వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేస్తారని, ఈ సందర్భంగా జరిగే బహిరంగ సభకు నగర ప్రజలు తరలివచ్చేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ పిలుపునిచ్చారు. 41వ డివిజన్‌లో కార్పొరేటర్, డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం బహిరంగ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ సీఎం జగన్ తపసిపూడి గ్రామ సముద్రతీరాన పోర్టు పనులు ప్రారంభించేందుకు పూజలు నిర్వహించి నగరంలో జరిగే బహిరంగ సభకు హాజరవుతారన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే బహిరంగ సభకు ప్రజలను ఆహ్వానించేందుకు కార్పొరేటర్లతో పాటు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లాలన్నారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, పార్టీ నగర కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుతో భూసారం పెంపు

డీడీఏ జ్యోతిరమణి

ఘంటసాల(అవనిగడ్డ): పచ్చిరొట్టను సాగుచేయడం ద్వారా భూసారాన్ని పెంచవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ జ్యోతిరమణి అన్నారు. మండల పరిధిలోని తాడేపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం భూసార పరీక్షల ప్రాముఖ్యత, పచ్చిరొట్ట విత్తనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జ్యోతిరమణి మాట్లాడుతూ ప్రతి రైతూ భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా నేల స్వభావాన్ని తెలుసుకోవచ్చన్నారు. దీనివల్ల ఎలాంటి ఎరువులు వాడాలో తెలుస్తుందన్నారు. నేల కర్బన సేంద్రియ పదార్థాన్ని పెంపొందించేందుకు, నేల సారాన్ని మెరుగు పరిచేందుకు, చౌడును అరికట్టేందుకు పచ్చిరొట్ట సాగు ఎంతగానో దోహద పడుతుందని చెప్పారు. తొలకరి వర్షాలు కురిసిన వెంటనే పిల్లిపెసర, జీలుగ, జనుము రకాలను చల్లుకోవాలని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ కె. శ్రీనివాసరావు, ఏఓ పద్మజ, మండల వ్యవసాయాధికారి కె. మురళీకృష్ణ, వీఏఏ వై. ఆలీ, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీమన్నారాయణుడి వసంతోత్సవం

నేటి నుంచి స్వామివారి కుంభాభిషేక ఉత్సవాలు

కోడూరు: ఉల్లిపాలెం గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి వసంతోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకీలో ఆలయ మాడవీధుల వెంట ఊరేగించారు. ఆలయ నిర్మాణకర్త త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామీజీ పర్యవేక్షణలో శ్రీమన్నారాయణుడి 11 అడుగుల మూలమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణమూర్తులకు ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద వసంతోత్సవం, చందనోత్సవం నిర్వహించారు. స్వామివారి పుష్కర బ్రహ్మోత్సవాల ముగింపును పురస్కరించుకొని పూర్ణాహుతి జరిగింది. ఆలయ నిర్మాణం పూర్తయి 12 సంవత్సరాలు కావడంతో శనివారం నుంచి మహాకుంభాభిషేక మహోత్సవాలను ప్రారంభించనున్నామని అష్టాక్షరీ స్వామీజీ తెలిపారు. 12వ తేదీ వరకు కుంభాభిషేక ఉత్సవాలు జరుగుతాయని, అదే రోజు లక్ష మందికి అన్నసమారాధన జరుగుతుందని స్వామీజీ తెలిపారు.

అన్నిరంగాలకు బ్యాంకింగ్ సేవలు విస్తృతం

నాగాయలంక: సమాజాభివృద్ధే లక్ష్యంగా సప్తగిరి గ్రామీణ బ్యాంక్ అన్ని రంగాలకు బ్యాంకింగ్ సేవలు విస్తృతం చేస్తోందని బ్యాంక్ చైర్మన్ పి.సత్యనారాయణ ప్రసాద్ అన్నారు. సప్తగిరి గ్రామీణ బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను నాగాయలంకలో శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు, ఉమ్మడి కృష్ణాలో వ్యాపించిన తమ బ్యాంకు 235వ శాఖను నాగాయలంకలో ఏర్పాటు చేశామని చెప్పారు. గోల్డ్ లోన్స్, రైతు రుణాలు, చేపలు, రొయ్యల చెరువులకు రుణాలు, విద్యా రుణాలు, గృహ రుణాలు అందించడంతో పాటు వాణిజ్య బ్యాంకులలో లభ్యమయ్యే అన్ని సేవలు అందిస్తున్నామన్నారు. రీజనల్ మేనేజర్ ఎస్. బ్రహ్మయ్య మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలో ఇప్పటికే నాలుగు బ్రాంచ్‌లు ఉన్నాయని, అయిదో బ్రాంచ్‌గా నాగాయలంకలో ప్రారంభించామని, త్వరలో ఆరో బ్రాంచ్ కోడూరులో ఏర్పాటు చేస్తామన్నారు.

ఈ ప్రాంత రైతులు, డ్వాక్రా మహిళలు బ్యాంకు సేవలను వినియోగించుకుని సహకరించాలని కోరారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, ఆర్ఎం ఆఫీస్ చీఫ్ మేనేజర్ రాజా శ్రీనివాస్, బ్రాంచి మేనేజర్ బీజే విఠల్ విహారి, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి పెంపొందాలి

పెడన: ప్రతి ఒక్కరిలో క్రీడాస్ఫూర్తి పెంపొందాలని, అప్పుడే స్నేహ పూరిత వాతావరణం ఉంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు శుక్రవారం మెమెంటోలు, నగదు అవార్డులను అందజేశారు. జోగి రాజీవ్ మాట్లాడుతూ బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 20 రోజులుగా జిల్లా స్థాయిలో కౌన్సిలర్ శిరివెళ్ల జయేష్ ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారన్నారు. శివసాయి, సాయిలు ఆర్గనైజర్లుగా ఉంటూ ఈ పోటీలను నిర్వహించారని చెప్పారు. ప్రథమ స్థానంలో నిలిచిన చిట్టిపాలెం టీంకు మెమెంటో, రూ.30 వేల నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన గుడివాడ టీంకు మెమెంటో, రూ.15 వేల నగదు బహుమతులను రాజీవ్ అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాజీవ్

ఎస్సీ వర్గీకరణపై మాయావతి ప్రకటన చేయాలి

మచిలీపట్నంటౌన్: ఎస్సీ వర్గీకరణపై బహుజన సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి సానుకూలంగా ప్రకటన చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కొల్లూరి బసవమాదిగ డిమాండ్ చేశారు. స్థానిక ఓగిస్‌పేటలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద శుక్రవారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. బసవ మాదిగ మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన హైదరాబాద్ వస్తున్న మాయావతి ఎస్సీ వర్గీకరణపై సానుకూలంగా స్పందించాలని కోరారు. ఎస్సీ వర్గీకరణపై మాయావతి తన వైఖరిని వెల్లడించాలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మరియకుమార్, జయప్రకాష్, గణేష్, కిషోర్, మోషే, విజయకుమార్, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంఈఓగా ప్రసాద్ నియామకం

పెడన: పెడన ఎంఈఓ మెటల్దారాణి దీర్ఘకాలిక సెలవులో వెళ్లడంతో ఆమె స్థానంలో బంటుమిల్లి ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్‌ను ఇన్‌చార్జి ఎంఈఓగా నియమిస్తూ డీఈఓ తాహెరా సుల్తానా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రసాద్ ఎమ్మార్సీలోని ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

8న గణపతి పంచమ వార్షికోత్సవం

కోడూరు: కోడూరులోని సిద్ధిబుద్ధి సమేత ప్రసన్న గణపతి స్వామివారి పంచమ వార్షికోత్సవం ఈ నెల 8వ తేదీన నిర్వహిస్తామని ఆలయ కమిటీ శుక్రవారం తెలిపింది. స్వామివారి ఆలయాన్ని నిర్మించి ఐదేళ్లు పూర్తి కావడంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉదయం గణపతి మూలవిరాట్‌కు నవవిధ అభిషేకాలు, మధ్యాహ్నం 11 గంటలకు అన్నసమారాధన జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

పద్య పఠనం విజేతకు బహుమతి ప్రదానం

అవనిగడ్డ: జిల్లా స్థాయిలో నిర్వహించిన పద్య పఠనం పోటీల విజేత టి.ధాత్రికి రూ.10 వేల నగదు బహుమతిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమారాణి అందజేశారు. మహాకవి శ్రీశ్రీ జయంతి సందర్భంగా విజయవాడలో జరిగిన జిల్లా స్థాయి పద్యపఠనం పోటీల్లో స్థానిక విద్యార్థిని ధాత్రి ప్రథమ బహుమతి అందుకుంది. ఆమెను పలువురు అభినందించారు.